28న టాటా జయంతి సందర్భంగా అవార్డుల ప్రదానం

బర్కత్‌పుర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రతన్ టాటా జయంతిని ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. బొగ్గులగుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఈ జయంతి సందర్భంగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు గురువారం బర్కత్‌పురలోని కౌన్సిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఓయూ ప్రొఫెసర్ వై.జహంగీర్, ఎక్సల్ గ్రూప్ కంపెనీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ వీణాపాణి, సీఐఎస్ ఎండీ ఎం.జయరాజ్, రెడ్డి కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేణుకసాగర్‌లకు టాటా ఎక్సలెన్సీ అవార్డులను పారిశ్రామికవేత్త బండారి దయానంద్‌యాదవ్‌కు ఉద్యోగపతి అవార్డు ప్రదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ చిట్యాల పురుషోత్తమ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. డీడీహెచ్ పరిధిలోని దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఆస్పత్రి, విజ్ఞాన్‌పురికాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రామ్‌నగర్ పరిధిలోని శ్రీనివాస టెక్స్‌టైల్స్, ఈసేవ తదితర ప్రాంతాల్లో 11 నుంచి 1.30, నల్లకుంట పరిధిలోని విజయబ్యాంక్, భారత్ ఇన్‌స్టిట్యూట్ తదితర ప్రాంతాల్లో 11.30నుంచి 1.30, సీసీ ష్రాఫ్ పరిధిలోని బూమన్నగల్లీ, రాజేంద్రనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



రాజా డీలక్స్ చౌరస్తా వద్ద అధ్వానంగా మారిన రోడ్డు

అధ్వానంగా రాజా డీలక్స్ చౌరస్తా

ముషీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని రాజాడీలక్స్ చౌరస్తా వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. దీనికి తోడు వర్షం నీరు గుంతలలో నిలిచిపోవడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. 1000 ఎంఎం మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు సైతం కొనసాగుతుండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొంతకాలంగా ఈ ప్రాంతంలో రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో నిత్యం డ్రైనేజీ, తాగునీరు, వర్షంనీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ప్రమాదాలకులోనవుతున్నారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాకే రోడ్డు వేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.



రాంనగర్ చౌరస్తాలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ ప్రేమ్‌కుమార్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ముషీరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని హోరేబు చర్చి ఆధ్వర్యంలో రాంనగర్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాస్టర్ ప్రేమ్‌కుమార్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి దైవ సందేశాన్ని అందించారు. అనంతరం ఏసు ప్రభు భక్తిగీతాల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు ఆల్విన్, మైకెల్, మురళీమోజెస్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'శతాబ్ది'దాటిన మహనీయులకు సన్మానం నేడు

చిక్కడపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని చోడేశ్వర నాట్యకళామండలి ఆధ్వర్యంలో శతాబ్దిదాటిన మహనీయులకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు మల్లాది వెంకటరమణ, సభ్యులు చంద్రకిశోర్, స్రవంతి గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం త్యాగరాయగానసభలో జరిగే ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తి, రిటైర్డ్ డీఈవో బ్రహ్మానందంలను సన్మానిస్తామని ఈ సందర్భంగా శ్రీకృష్ణరాయబారం పద్యనాటక ప్రదర్శన జరుగుతుందని ప్రేక్షకులు, పద్యనాటక ప్రియులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఎంఏ సిద్దిఖీ, సనాఉల్లా హుస్సేన్ తదితరులు

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

నల్లకుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మాజీ ఎంపీ అజీజ్‌పాషా ఆరోపించారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆలిండియా ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఎ.సిద్దిఖీ, నాయకుడు సనాఉల్లా హుస్సేన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ముస్లిం శ్మశానవాటికలు దాదాపు కనుమరుగయ్యాయని, నగరశివారులో 125 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని కేటాయించాలన్నారు. ముఖ్యంగా ఇల్లు లేని పేద ముస్లింలకు 100 గజాల స్థలం కేటాయించాలన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించడంలో పాలకులు విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. వక్ఫ్‌బోర్డు కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మునీర్, మహ్మద్ జహంగీర్ పాల్గొన్నారు.



వేము నరేందర్‌రెడ్డిని కలిసిన గుజ్జ కృష్ణ తదితరులు

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రాంనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కులగణన చేపట్టాలని పలు బీసీ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేము నరేందర్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల ప్రతినిధులు నీల వెంకటేష్, వేముల రామకృష్ణలు వినతిపత్రం సమర్పించి విన్నవించారు. బీసీల డిమాండ్ల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

● విజేతలకు బహుమతులు

హబ్సిగూడ నాచారంలోని బచ్పన్ అకాడమి హైట్స్ విద్యారుథల వార్షిక క్రీడా దినోత్సవం గురువారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగింది. వివిధ క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ చిలుక శివకుమార్, కరస్పాండెంట్ కల్పనజ్యోతి బహుమతులు అందజేశారు.



- అంబర్‌పేట

రోడ్లపై పార్కింగ్

- రోడ్డుకు ఇరువైపులా నిలుపుతున్న వాహనాలు
- ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

నల్లకుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని ప్రధాన రహదారులు, కూడలి ప్రాంతాల్లోని పలుచోట్ల బైక్‌లు, కార్లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా డివిజన్‌లోని ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, శంకరమఠం మెయిన్‌రోడ్డు, తిలక్‌నగర్ చౌరస్తా, శివంరోడ్, చే నెంబర్ చౌరస్తా, గోల్నాక కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పలు షాపుల ముందు బైక్‌లు నిలుపుతుండడంతో వాహనాల రాకపోకలు సాగించడంలో అటు పాదచారులు, ఇటు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని పలు హోటల్స్, హోల్‌సేల్, రిటైల్



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద హోటల్ పక్కనే.



సిద్ధార్థ హోటల్ వద్ద రోడ్డుపై నిలిపిన బైక్‌లు

కిరాణ షాపులు, వైన్‌షాపులు, బార్లు, పలు విద్యా సంస్థల వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. రహదారులకు ఇరువైపులా బైకులు, కార్లు పార్కింగ్ చేయడం వల్ల తరుచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమమ పార్కింగ్ విషయమై ట్రాఫిక్ సిబ్బందికి అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం టార్గెట్ చేరుకోవడానికి చలాన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కానీ ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై నిలిపివేస్తున్న వాహనాలపై ఏ మాత్రం ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చలాన్లు వేసేందుకు ఫొటోలు తీయడంతో ట్రాఫిక్ పోలీసులు చూపిస్తున్న శ్రద్ధ నల్లకుంటలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై నిలుపుతున్న వాహనాలపై దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి



నల్లకుంటలోని మెయిన్, అంతర్గత రోడ్లపై అడ్డదిడ్డంగా నిలుపుతున్న ద్విచక్రవాహనాలు, కార్లపై ట్రాఫిక్ పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. సమయానికి గమ్యస్థానాలకు వెళ్లడంలో అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలి.

- ఎన్.ఇ.మహేందర్, సత్యానగర్, స్థానికుడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి, గుమ్మడి నర్సయ్య తదితరులు

'డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి'

రాంనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు రైతుభరోసా ఇవ్వాలని, అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని, చిన్న సన్నకారు, మధ్యతరగతి రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, అటవీహక్కు చట్టం 2006 డిమాండ్లతో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో జనవరి 9న డిమాండ్స్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెచ్చెల రంగారెడ్డి, పుష్పల రంగారెడ్డిలు తెలిపారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో డిమాండ్స్ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు బి.రాములు, నంది రామయ్య, కార్యదర్శులు దేవదాస్, చంద్రన్న, సురేష్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు మహాత్ముడు

మాజీ ఎంపీ హనుమంతరావు

రాంనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు 1926 డిసెంబర్ 26న బాధ్యతలు చేపట్టి నేటికీ వందేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం ముషీరాబాద్ గాంధీనగర్ చౌరస్తా వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి వీహెచ్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తూ రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్, మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్‌జాన్, బాగ్అంబర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్‌గౌడ్, లింగంగుప్తా, పీటర్, నాగేంద్రప్రసాద్, కోటం అనిల్‌కుమార్, మనోజ్, చిరంజీవి, జామీల్, సునీల్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీహెచ్ తదితరులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న వారిని సత్కరిస్తున్న దృశ్యం

నగరానికి టిబెటియన్ల ర్యాలీ

సికింద్రాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి స్వాతంత్ర్యం కావాలని కోరుతూ టిబెట్‌కు చెందిన టిబెటియన్ యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు చేపట్టిన ర్యాలీ గురువారం 36వ రోజు హైదరాబాద్‌కు చేరింది. ఈ ర్యాలీని సికింద్రాబాద్ ఎంజీరోడ్డులోని గాంధీవిగ్రహం వద్ద మెజీషియన్ సామల వేణు, ప్రొఫ్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం నుంచి టిబెట్‌కు కొని దశాబ్దాల నుంచి మద్దతు లభిస్తుందని, ఇందుకు కృతజ్ఞతగా బైక్ ర్యాలీ ప్రారంభించామని తెలిపారు. నవంబరు 22న అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ 11 మంది సభ్యులతో 20 వేల కి.మీ. తిరిగి ఢిల్లీలో ముగుస్తుందని తెలిపారు.

ప్రజాకవి కాళోజీకి పీవీ స్మారక పురస్కారం

- రేపు డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రదానం
- హాజరు కానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బర్కత్‌పుర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్మారక పురస్కారం 2024ను ప్రముఖ ప్రజాకవి, పద్మవిభూషణ్ దివంగత కాళోజీ నారాయణరావుకు ప్రదానం చేస్తున్నట్లు పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ వెల్లడించింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ సలహాదారులు పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరి, ఆర్టీఐ మాజీ కమిషనర్ పి.విజయబాబు, విశ్రాంత ఐఏఎస్ ఎం.బాలలత, ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడారు. పీవీ నరసింహారావు స్మారక పురస్కారం 2024 ప్రజాకవి కాళోజీ నారాయణరావు అనుచరుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గతంలో పీవీ నరసింహారావు స్మారక పురస్కారం పద్మవిభూషణ్ రతన్‌నావల్ టాటా, దలైలామాకు అందజేయడం జరిగిందన్నారు. ఈనెల 28న రవీంద్రభారతిలో జరిగే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, సురభి వాణిదేవి, అమెర్ అలీఖాన్, మాజీ ఎంపీ కె.వి.రామచంద్రరావు, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో న్యాయవాది శ్రీకర్‌శర్మ, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరి

29న మున్నూరు కాపు వివాహ పరిచయ వేదిక కార్యక్రమం

నల్లకుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు వివాహ పరిచయ వేదిక కార్యక్రమం కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో నిర్వహించనున్నట్లు మహాసభ ప్రత్యేక ఆహ్వానితులు కట్టెల సుభాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే యువతీ, యువకులు తమ తల్లిదండ్రులతో కలిసి రావాలని సూచించారు. కొత్త రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సదుపాయం కలిగిన వారు కుల, జనన ధృవీకరణ, స్టడీ సర్టిఫికెట్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకువచ్చి ఈ వివాహ పరిచయ వేదికకు హాజరుకావాలని తెలిపారు. భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. వివరాల కోసం మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్ 93903 54580, 99631 66363లకు సంప్రదించాలని ఆయన కోరారు.

అవోపా వధూవరుల పరిచయవేదిక

చిక్కడపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆర్యవైశ్య వధూవర పరిచయ వేదిక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్లోబల్‌ట్రస్ట్ బ్యాంక్ మాజీ చైర్మన్ జి.రమేష్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు వధూవరుల పరిచయవేదిక నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, అవోపా నగర కమిటీ అధ్యక్షుడు రేణికుంట్ల నమశ్శివాయ, మడుపల్లి రవి, మాకం బద్రినాథ్, శ్రీనివాస్, విఠల్, సత్యనారాయణ, లక్ష్మయ్య, రమేష్, చంద్రమోహన్, అనూష, సాం బశివరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషా సంస్కృతిని పరిరక్షిస్తున్న ప్రవాసాంధ్రులు

చిక్కడపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో స్థిరపడ్డ తెలుగు వారు మన భాషా సంస్కృతులను మనకన్నా ఎక్కువగా పరిరక్షిస్తున్నారని వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) వ్యవస్థాపకులు వంశీ రామరాజు అన్నారు. చిక్కడపల్లిలోని ఎలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో అమెరికాలో స్థిరపడిన ఎస్‌పిబి మ్యూజిక్ ఇంటర్నేషనల్ చైర్మన్ శ్రీనివాస్ గూడూరుకు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగింది. రామరాజు అవార్డు బహూకరించారు. గానవిభావరిలో పాల్గొన్న గాయనీగాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు పురస్కారం బహూకరిస్తున్న రామరాజు



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిబంధనలు పాటించని హాస్టళ్లను మూసివేయాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావిద్ మాట్లాడుతూ నగరంలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండానే హాస్టళ్లను నడిపిస్తూ విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో శ్యామ్‌బాబు అనే వార్డెన్ విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తిస్తూ ఫీజుల పేరుతో వేధిస్తున్నాడని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడని వారు మండిపడ్డారు. విద్యార్థినుల తరపున ఎవరైనా అడిగేందుకు వెళ్తే కర్రలతో దాడులు చేస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తూ రౌడీయిజం చేస్తున్నాడని ఆరోపించారు. నగరంలోని హాస్టళ్లను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లెనిన్, ప్రశాంత్, శ్రీమాన్, చరణ్‌శ్రీ, విగ్నేష్, రాజేష్, పద్మ, కుమార్, నరేష్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఇందిరాపార్కు వద్ద ధర్నా

కవాడిగూడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారు నిర్వహిస్తున్న సమ్మెతో పాటు ఉద్యోగులు చేసే ఉద్యమాలకు తమవంతు మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు. సమగ్ర శిశు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను రెండు మూడు రోజుల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. సమగ్ర శిక్ష, ఉద్యోగులు ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రొఫెసర్ కాసిమ్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో ఎమ్ఎఫ్ కన్వీనర్ ఆర్ వెంకట్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్‌యాదగిరి, ప్రధాన కార్యకార్యదర్శి జాన్సి సౌజన్యతో పాటు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

కనులపండువగా మహాపడిపూజ

నల్లకుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ రత్నానగర్ కమ్యూనిటీహాల్‌లో గుమ్మడి విశ్వనాథ్ ఆధ్వర్యంలో 18వ అయ్యప్ప స్వామి మహాపడి కార్యక్రమం ప్రధాన పూజారి శంకరన్ నంబూద్రి, డాక్టర్ రాజు గురుస్వాముల పర్యవేక్షణలో గురువారం కన్నులపండుగా జరిగింది. ప్రవీణ్ భజన బృందంచే శ్రీఅయ్యప్ప స్వామియే శరణం అయ్యప్ప భక్తిగీతాలాపతో పరిసర ప్రాంతాలలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ సందర్భంగా అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు, అభిషేకం, పల్లకీసేవ సత్యానగర్ పురవీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూసరి వెంకట్‌గౌడ్ గురుస్వామి, గుమ్మడి విక్రమ్, మహేందర్, అమర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ డివిజన్‌లోని మోతీమార్కెట్‌లో పడిపూజాలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్‌లో మహాపడి

బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురుస్వామి జెల్లి శ్రీమంత్‌గిరి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటం అనిల్‌కుమార్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, పంజాల వెంకట్‌గౌడ్, రంగంపల్లి రాజు, చందు పటేల్, శశిగౌడ్, సునీల్, మనోజ్‌కుమార్, జమీల్ బాయ్, జహంగీర్ పాల్గొన్నారు.

● రేపు మహాపడిపూజ

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని కవాడిగూడ మెయిన్‌రోడ్ శ్రీనివాసగ్రౌండ్స్‌లో ఈనెల శనివారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల కార్యనిర్వహణ సమీక్షను గురువారం జవహర్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ నిర్వహించారు. డివిజన్ ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమీక్షలో డివిజన్ బీజేపీ నేతలు వినయ్‌కుమార్, శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాగ్అంబర్‌పేట డివిజన్ అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో..

● ఘనంగా గగన్‌మహల్‌లో..

కవాడిగూడ: దోమలగూడ గగన్‌మహల్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్పస్వామి మహాపడిపూజా కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.ఆర్.కె.ప్రసాద్ అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

IN THE COURT OF THE III ADDL DIST & SESSIONS JUDGE
RANGAREDDY DISTRICT: AT: L.B.NAGAR
I.A. No.85 of 2022
In
OS No. 605 of 2015

Between:
Dr.M.Satchidananda Rao
...Petitioner/ PLAINTIFF
And
U. Alexander Reddy and others
...Respondents/DEFENDANTS

To
U.Lourdu Reddy, S/o. Sri U.G.Reddy, Aged about 57 years, Occ: Service, R/o.48, Aravind Nagar, Domalguda, Hydeabad - 500 029.
... Respondent No.52

WHEREAS the above named Petitioner herein filed the above IA under Order 1 Rule 10 R/w Section 151 CPC, seeking to implead you as Defendant No.52 in OS no. 605 of 2015. The same is posted to 08-01-2025 for your appearance.

Therefore, you are hereby directed to be present your self or through Advocate, positively, the above said Court on the above said date at 10.30 A.M failing which the matter will be heard and determined in your absence, exparte.

// By Order of the Hon'ble Court //

S. MALLA RAO,
D. Mahender Rao
K. Shashidhar, G. Satish Kumar,
B. Dhraj Kumar & E. Srinivas Reddy
Advocates
Unit No.G-3B, T-19 Towers
Rani Gunj, Secunderabad - 500 003
Cell No: 98480 11772

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362